# "శని గ్రహం"

(కథానిక)

"ఎవరికిరా మంచినీళ్లు?"

"నా స్నేహితుడికి లే."

"ఎవర్రా ఆ. నీ స్నేహితుడు?"

"… … … …"

"రాత్రంతా యిక్కడే ఉన్నాడా?"

"నీకెట్లా తెలిసిందమ్మా. నీవు విన్నావా?"

"ఏమిట్రా ఆ కంగారూ? వినడమేమిటి వినడం!"

"అదేనే, మా మాటలు."

"ఏమి మాటల్రా?"

"అదేనే మేము రాత్రి మాట్లాడుకున్న మాటలు."

"ఏమిట్రా, ఆ డొంక తిరుగుళ్లు... చెప్పేదేమిటో సరిగ్గా చెప్పరాదూ?"

"నీకు చెప్పాలనే నేనే నిక్కడికి వచ్చింది"

"ఏమిట్రా చెప్పడం?"

"అదేనే, నీవు రాత్రి విన్నదే!"

"ఏదో గుసగుస శబ్దం తప్ప నేనేమి విన్నాన్రా?"

"అంతేనా. అయితే, విషయమంతా నేను మళ్లీ మొదలుపెట్టి చెప్పాలిసిందేనా?"

"ఏమిట్రా, ఏదో రాచకార్యంలాగు అంతసేపు సాగదీస్తావ్?"

"ఏమీ లేదే... రాత్రి నారాయణమూర్తిని తీసికొచ్చాను."

"ఆ! నారాయణమూర్తినే! వాడెక్కడ దొరికాడ్రా నీకూ?"

"ఏమమ్మా అట్లా అంటావు!"

"ఇంకా అనేదేమిట్రా. అయినా ఆ శనిగ్రహం నిన్నెక్కడ పట్టుకుంది?"

"ఏమిటమ్మా ఆ మాటలు! నారాయణ్ణి గూర్చినా నీ వనేది?"

"అయితే వాడినిగూర్చి ఇక నేం అనాల్రా?"

"అది కాదమ్మా. ఒక్కసారి ఆలోచించు, ఇదివర కెన్నిసార్లు నీవు నారాయణంత మంచి వాడ్లు లేడని పొగడలేదు? నన్ను నారాయణ్ణి చూచయినా బుద్ధి తెచ్చుకొమ్మని యెన్నిసార్లు మందలించలేదు?"

"బాగా నేవుంది. అప్పటి నారాయణకీ యిప్పటి నారాయణకీ సాపత్య మేముందిరా."

"ఏమిటమ్మా నీవు చూసిన మార్పు?"

"అదేరా, వాడు ఆ మురావాళ్ళతో చేరి నానా భీభత్సాలూ చేస్తూండలా?"

"వాడేంచేశాడో నీవు చూచావటే!"

"మా చేదేముందిరా. పేపర్లలో ఆ ముఠా వాళ్లు చేసే పనులు చదువుతుండలా?"

"పేపర్ల మాటలన్నీ నిజాలని నమ్మడమెట్లా నమ్మా?"

"అబ్బ, పోరా నీతో నే వాదించలేనూ. పోనీ యీ మాట వింటే మీ నాన్న ఏమంటాడో చెప్పు? ఆయనకు తెలిస్తే యెంత రాద్ధాంత సిద్ధాంతాలు జరుగుతయోనన్నా ఆలోచించావా?"

"ఇప్పుడు నాన్నకు తెలిసేంత అవసరం ఏమొచ్చింది లేవే. వాడు నా గదిలోనే ఉన్నాడుగా!"

"అసలెందుకు తీసుకొచ్చావురా వాడిని... చదువు సంధ్యలు కూడా మంట గలుపుకోడానికి!"

"అదిసరి లేవే! వాడికి నాలుగు రోజులబట్టి జ్వరం తగులుతోందిట. ఆ సంగతి నాకు నిన్న సాయంత్రం తెలిసింది. నిన్న అర్ధరాత్రి మెల్లిగా యిక్కడికి చేర్చేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. వాడికి పథ్యం పానం మందూమాకూ సరీగా చూడకపోతే వాడు మనకు దక్కేట్లు లేడు."

"అయ్యో, రామా! వాడికి ఏమి కర్మ పట్టిందిరా. హాయిగా కావలసినంతుంది. తిని

నాయని ఇందిరాదేవి

తిరగక ఎందుకో [redacted] పు! యీ పార్టీలనీ పచ్చిబద్దలనీ [redacted] కనిపించకమరీ నల్లపూసై తిరుగు[redacted]డు."

"నాకు బాగా తెలుసునమ్మా నీ హృదయం! నీవు నారాయణ్ణి తప్పక ఆదరిస్తావన్న ధైర్యంతోనే యిక్కడికి తీసుకొచ్చాను. కొంచెం అన్నం త్వరగా వండమ్మా."

"అన్నమెందుకురా. కొంచెం జావకాచి తీసుకొస్తాను. యిలోగా నీవు డాక్టర్ గారింటికెళ్ళి అమ్మాయికి నాలుగురోజులుగా జ్వరంగా ఉందని కొంచెం మందు తీసుకొచ్చి వాడికియ్యి."

నవ్వు ముఖంతో మంచినీళ్ళ గ్లాస్ తీసుకుని రామం తన గదివైపు నడిచాడు. పమిటె కొంగుతో కళ్ళద్దుకుని సీతమ్మ మజ్జిగ చిలకడం మొదలుపెట్టింది. ఇంతలోకే కాగితం కలం పట్టుకుని విజయ ప్రవేశించింది. ఆపిల్ల వయస్సు పదునాలుగు సంవత్సరాలు. స్కూలుఫైనల్ చదువుతోంది. చిరాకుతో నిండిన ఆపిల్ల ముఖం చిలిపిగా మరీ అందంగా వుంది.

"అమ్మా! అమ్మా! నా ఇంగ్లీషు పుస్తకం చూచావా?"

"నీ అరలో లేదూ?"

"అబ్బ! నా అరలో వుంటే నీదాకా యెందుకూ? చంపకే చెబుదూ నీవు తీశావో లేదో."

"నాకెందుకే, నీ పుస్తకం? నేనేమన్నా ఇంగ్లీషు చదవగలుగుదునా పాడా?"

"అవున్లే! ప్రొద్దస్తమానం చిరాకుపడడం తప్ప నీవేమయినా వెతికిస్తావా, పాడా. అయినా, నిన్నడగడం నాదే బుద్ధితక్కువ."

"ఉట్టి వెఱ్ఱికల్లివి! అంతకోపమైతే ఎట్లా? నీ పుస్తకాలు వెతికిపెట్టడానికి నాకు తీరక ఎక్కడుందో చెప్పు? మా అమ్మవుగా ... అన్నయ్యను కనుక్కో వాడు గాని తీశాడేమో."

"ఆ, అన్నయ్య తీస్తాడు! ఆయనకేం పట్టింది వెధవ నా పుస్తకాలు చదివేంత అవసరం అయినా, ప్రొద్దస్తమానం తలుపులు బిడాయించుకొని కూర్చుంటాడుగా."

విజయ, రామం గది తలుపులు దబదబా బాదింది. గడియవేసి లేనందువల్ల అవి తెరుచుకోవడానికి ఆట్టే సేపు పట్టలేదు. ఆమె గదిలో అడుగు పెట్టింది. అది విశాలమైన గదే! ఆ గదికి ఉత్తరపు గోడన దక్షిణపు గోడన గోడ అలమారలున్నయ్. దక్షిణం పక్క కిటికీదగ్గర ఒక కుర్చీ ఒక టేబుల్ ఉన్నయ్. ఆ టేబిల్ మీద న్యూస్ పేపర్లూ, సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె ఏవో కొన్ని పుస్తకాలూ చిందరవందరగా పడివున్నయ్. తూర్పుప్రక్క కిటికీ దగ్గరగా మంచం...ఆ మంచంమీద నిండా ముసుగు పెట్టుకుని నిద్రిస్తోన్న ఒక వ్యక్తి!

విజయ తట్టి లేపుతూ,

"అన్నయ్యా, నీవుగాని నా ఇంగ్లీష్ బుక్ తీశావా?"

నారాయణ ముసుగు తొలగించి కళ్లు విప్పి చూశాడు. మౌనంగా, ఆమె కళ్ళల్లోకి చూస్తూనే ఉన్నాడు. విజయ ఒక్కసారి ఉలిక్కిపడ్డది. ఆమె, నారాయణ్ణి చూచి దగ్గరదగ్గర రెండు సంవత్సరాలు కావస్తోంది. అతన్ని యీమధ్య చూడకపోయినా అతన్ని గూర్చి ఆ ఊరిలో అందరూ చెప్పుకుంటున్న మాటలు ఆపిల్ల గొడ్డో గొప్పో వింటూనేవుంది. నారాయణ పార్టీలోచేరి హింసాకాండ జరుపుతున్నాడనీ ..ప్రభుత్వం వెంటాడి జైలుపాలు చేస్తుందని అజ్ఞాతవాసం చేస్తున్నాడనీ ఆ పిల్ల విన్నది. అంతకుముందు ఆమెకు నారాయణ బాగా తెలుసు. అతను అన్నయ్యతో కలిసి రోజూ తమ యింటికి వచ్చి చదువుకుంటుండేవాడు! తాను లెక్కలు అడిగితే విసుక్కోకుండా, ఓపిగ్గా అన్నయ్యకన్నా బాగా చెప్పేవాడు. అప్పుడు, నిజంగా నారాయణ ఎంతో మంచివాడనుకునేది విజయ. కాని, అతను యిట్లా యెందుకు మారిపోయాడో...ఆ అల్లరి మూకలోచేరి యిట్లాంటి అత్యాచారాలెందుకు చేస్తున్నాడో ఆ పిల్లకు అర్థంకాలేదు. "ఛ! నారాయణ అట్లాంటి పనులెందుకు చేస్తాడూ-" అని సమర్థించుకోబోయింది గాని "తప్పు చేయకుంటే యీ తప్పించుకు తిరగడాలెందుక"న్న ఎదురు సమాధానం ఆ పసిగుండెను తాకి, అందరిలానే తననూ నారాయణ్ణి ద్వేషించేలా చేసింది. కాని, నేడు నారాయణ తమ యింటిలో అన్న గదిలో హాయిగా మంచం

మీద పందుకోని వుండడం చూచేసరికల్లా ఆమెకు నారాయణమీద అందరూ ప్రయోగించిన మాటలు కేవలం కల్పితాలేమో ననిపించింది. విజయ మళ్ళీ ఒక్కసారి నారాయణ కళ్ళల్లోకి చూచింది. ఆ కళ్ళల్లో ఆమెకు అదే మంచితనం అదే ఓపికా అగుపించినయ్.

నారాయణ కొద్దిక్షణాలు గడిచింతర్వాత గాని పరిసరాల నర్థం చేసుకోలేక పోయాడు. అతని దృష్టిలో విజయ యింకా లోకం తెలియని పసిపిల్లే! తానిక్కడ ఉన్నాడని ఎవరితోనన్నా చెబుతుందేమోనని "విజయా" అని పిలిచాడు. ఆమె ఆ పిలుపు వినిపించుకోకుండా గదిదాటి బయటకు వెళ్ళింది. నారాయణ కూడా తలుపు దగ్గరగా వచ్చి నిలుచున్నాడు. అతనికి తండ్రిగదిలోకి వెళుతోన్న విజయ అడుగుల సవ్వడి వినిపిస్తూనే వుంది.

"నాన్నా!"

"ఏమిటి, విజయా?"

"ఏం లేదు. మీరు నారాయణెక్కడో అజ్ఞాతవాసం చేస్తున్నాడని కదూ, అన్నారు?"

"అవును. ఆ వెధవ నీకిప్పుడెందుకు జ్ఞాపకమొచ్చాడమ్మా!"

"ఎందుకు నాన్నా, అనవసరంగా అతన్ని తిడతారు? అతనేం అల్లరి చిల్లరివాడు కాడే... తప్పుకు తిరగడానికి!"

"తప్పుకు తిరక్క ఇప్పుడేం చేస్తున్నాడంటావ్?"

"ఏం? హాయిగా ఉన్నాడు."

"ఎక్కడా?"

"ఎక్కడేమిటి? ఇక్కడే మనింట్లోనే!"

తరువాత ఆయన ఏమన్నాడో నారాయణకు వినిపించలేదు. తన కాళ్ళక్రింది భూమి కదలిపోతున్నట్లనిపించింది. ఒక్క ఉదుటున తూర్పువరండా తలుపు తెరుచుకుని వీధిలో పడ్డాడు. అతనది పట్టపగలన్న సంగతికూడా మరచిపోయాడు.

* * *

రామం, గదిలో తల దించుకుని కుర్చీమీద కూర్చుని ఉన్నాడు. విషాదంతో కూడిన అతని కనులు ఆ పరిసరాలకు చాలా దూరంలో యెక్కడో ఆలోచనలు జరుపుతున్నాయి.

సీతమ్మ ప్రవేశించింది.

"లే, నాయనా! భోజనం చేద్దువుగాని."

"ఏం భోజనం ఉండవే."

"అట్లా అనుకుంటే ఎట్లారా? నీవు మంచి చేద్దామనుకున్నావు గాని..."

"ఆ! మంచిచేసినట్లే వుంది. వాడి తంటాలు వాడు పడతోంటే, ఏదో ఉద్ధరించేట్లు తీసుకొచ్చి చేజేతులా పోలీసులకు అప్ప చెప్పుకున్నాను."

"మధ్య నీవేం చేశావురా. అట్లా జరగాల్సి వుండి జరిగింది. అందుకని తిండీ తిప్పలూ లేకుండా విచారిస్తూ కూర్చుంటారా?"

"అబ్బ! అన్నం మాట నాముందు యెత్తవద్దమ్మా! వాడు జైల్లో ఏం మెతుకులు తింటున్నాడో యెన్ని లాఠీదెబ్బలు భరిస్తున్నాడో!"

"అయ్యో! ఇదే ధ్యాసయింది ఎట్లానమ్మా! లే, నాయనా. నామాట విను. ఒకముద్ద ఎంగిలి పడు. చూడు, నీవు తినకుంటే నేనూ తినను!"

"అబ్బ! నీతో ఒక చావు కాదే! ఇంత చాకిరీ చేస్తూ పైగా అన్నం మానుకుంటావా? లే, నేనూ తింటాను."

రామం వంటయింట్లో కెళ్ళాడు. తల్లి విస్తరి వేసింది. ఇంతలో బయటనుండి—"రామం! రామం!"

"ఏమిటి, నాన్నా?"

గోపాలరావు లోపల కొచ్చాడు.

"ఏరా, నీవేనా ఆ పెద్దమనిషికి ఆతిథ్యమిచ్చింది?"

రామం చాలా శాంతంగా అవునన్నట్లు తల ఊపాడు.

"ఏం, పలకవేం? నీ కెవరిచ్చారంట ఆ దేభ్యాన్ని ఇంటికి తీసుకురావడానికి అనుమతి?"

"నన్ను 'యెన్నన్నా' అనండి పడతానుగాని అతన్ని మాత్రం ఏమీ అనకండి నాన్నా, నేను సహించలేను."

"ఓహ్! ఆ ముండమోపిమీద ఎంత గౌరవం నుండిపోతోందోయ్. సరే గాని, అతగాడిని యెవరి అనుమతిమీద తీసుకొచ్చావు?"

"ఎవరి అనుమతి ఏముంది నాన్నా. ఇక్కడికి నాస్నేహితుణ్ణి తీసుకురావడానికి నాకు

అధికారం లేదా?"

"స్నేహితుడట, స్నేహితుడు! ఆ మాట అనడానికన్నా సిగ్గుపడడం లేదటరా."

"సిగ్గెందుకు, నాన్నా? పైగా గర్వపడుతున్నాను."

"ఛీ! వెధవా, అనవసరంగా వాగకు. ఆ గాడిదను యింట్లో చేర్చేముందు నా దేశ సేవకూ నాకీర్తి ప్రతిష్టలకూ ఎంత ముప్పు వాటిల్లుతుందో ఆలోచించావా?"

"కీర్తి ప్రతిష్టలతో నాకు పని లేదు, నాన్నా. నాకు ధర్మం న్యాయం అనితోచింది నేను చేస్తాను."

"ఏమో అనుకున్నా. తొండ ముదిరిందే! ఇక శేం ... నీవూ వాడి వాదనలోకే దిగుతున్నావ్. ఇదుగో నబ్బాయ్ యిదే చెప్పడం! యీ ఆస్తంతా నా స్వార్జితమని। తెలుసు కదూ?"

"ఎందుకు తెలియదు? ఇదంతా మీరు అమాయక ప్రజానీకాన్ని దోచుకున్న సొత్తని కూడా తెలుసు నాన్నా!"

"ఛీ! నాన్న! నీకు తండ్రి మీద గౌరవ ప్రవృత్తులున్నయ్‌రా, గాడిదా. ఇక నీవు నా యింట్లో ఒక్క క్షణం నిలవడానికి వీలు కాదు. ఫో! తక్షణం ఫో! నీ సిద్ధాంతాలు నిన్నెట్లా పోషిస్తాయో నేనూ చూస్తా, ఫో!"

"మీ నోటివెంటా ఆమాట ఎప్పుడెప్పుడొస్తుందాని చూస్తున్నా నానా. పోయివస్తా. అమ్మా, సెలవ్!"

విస్తరిముందు నించి లేచి దూకుడుగా వెళ్ళిపోయాడు రామం. సీతమ్మ అన్నం గిన్నె క్రిందపెట్టడమే మరచిపోయి నీళ్లు చిమ్మిన కళ్ళతో అలానే చూస్తూ నిలుచుండిపోయింది. నిప్పులు చెరగుతున్న గోపాలరావు కండ్లు వీధివైపు చూపులు నిగిడించినయ్.

రెండు సంవత్సరాలు గడిచినయ్.

విజయ యింటర్మీడియట్ పూర్తిచేసింది. ఇప్పుడు ఆమెకు తన అన్న ఎందుకు ఇల్లువిడిచి వెళ్ళిపోయిందీ, అమాయకురాలయిన తను ఆలనాడు నారాయణ్ణి గురించి తండ్రితో చెప్పిన మాటలు ఎలాంటిఫలితాలకు దారితీసిందీ బాగా అవగతమైనాయి,

యీ రెండేళ్లలో రామం జాడ ఏమీ తెలియలేదు. సీతమ్మమాత్రం కొడుకుమీది దిగులుతో కృశించి ఒరుగ్గెంది. గోపాలరావు తన కార్యదీక్ష మానలేదు. ఎలెక్షన్ల రోజులు దగ్గిర పడినయ్. పార్లమెంటరీ సీటుకు అభ్యర్థిగా పోటీ చేశాడు. సభా సమావేశాలు జరిపి ప్రచారం చాలా చక్కగా సాగిస్తున్నాడు.

సాయంకాలం దగ్గిర దగ్గిర ఆరు గంటలు కావస్తోంది. గోపాలరావు కోర్టు వీధిగుండా యింటికి వెళుతున్నాడు. అక్కడ ఏదో సభ జరుగుతోంది ఆది గోపాలరావు ప్రత్యర్థి నిమిత్తం జరుగుతున్న సభ. ఎవరో ఉపన్యసిస్తున్నారు. తన చర్యల్నీ, తను బలపరుస్తున్న పార్టీ చర్యల్నీ చాలా నిశితంగా విమర్శిస్తున్నారు. గోపాలరావు హృదయంలో తళుక్కున మెరిశాడు రెండు సంవత్సరాలనాడు తన ఆగ్రహానికి గురియై యిల్లు విడిచిపోయిన తన ఏకైక పుత్రుడు, రామం! ఆ కంఠంకూడ ఎక్కడో విన్నట్లేవుంది. కొద్దిదూరం నడిచాక గాని తిరిగిచూచే ధైర్యం లేకపోయింది గోపాలరావుకు. సభావేదిక మీద తన కొడుకు నిలబడి ఉన్నాడు. ప్రక్కన కుర్చీమీద నారాయణ కూర్చుని ఉన్నాడు. కళ్లు నులుముకుని మళ్లీ చూచాడు. రామమే! సన్నగా, కొంచెం నలుపెక్కి ఉన్నాడు. మైకు గుండా మాటలింకా వినిపిస్తూనే ఉన్నయ్. వినలేక గబగబా నడిచాడు. ఇంట్లో అడుగు పెట్టేసరికి భార్య వరండాలో నిలుచునివుంది. చెంబుడు నీళ్ళతో ముఖం కడుక్కుని, గ్లాసెడు నీళ్లుతాగి ఉయ్యాల బల్లమీద కూర్చునతరవాతగాని అతనికి ఊపిరి సలపలేదు. భర్త ముఖం చూస్తూ సీతమ్మ ప్రశ్నించింది,

"ఇంతకీ, కాయా పండా?"

"మనం అనుకున్నాక యిక పండుగాక కాయవుతుందటే. పిచ్చిదానా?"

"అయితే యిక ఆలస్యమెందుకూ. అమ్మాయిని కూడా కనుక్కుని ముహూర్తం పెట్టించరాదూ?"

"అదే నేనూ ఆలోచిస్తున్నా. కాని... యీ ఎలెక్షన్ల రోజులు గడవనీ."

"ఏమి ఎలెక్షన్లంటే? వీటికోసంగా ఎదిగున్న

పిల్ల పెండ్లి వాయిదా వేస్తామా?"

చేతిలో పత్రికతో విజయ ప్రవేశించింది.

"ఎవరికే అమ్మా పెండ్లి?"

"ఆ సంగతి నేను చెబుతాలే అమ్మాయ్, కానీ, ఆ పత్రిక ఏమిటి?" ఆమె చేతిలో పత్రిక తీసుకున్నాడు.

"ఇట్లాంటి పత్రికలు ఎన్నాళ్ళనుండి చదువుతున్నావు విజయా? ఎవరిచ్చారు నీకీ పత్రిక?"

"ఏం, నాన్నా! అట్లా అడుగుతున్నారు?"

"ఏం లేదమ్మా. యిట్లాంటివి మనం చదవకూడదు. అయినా ఎవరిచ్చారు యిది నీకు?"

"ఇవాళ మధ్యాన్నం అన్నయ్యా నారాయణా వచ్చారు."

"మన గుమ్మం తొక్కనని ప్రగల్భాలు కొట్టైనే ఎట్లావచ్చాడుమళ్ళీ మనగుమ్మంలోకి?"

"లోపలకు రాలేదు, నాన్నా. నేనెంత బ్రతిమాలినా రానన్నాడు. నేనూ, అమ్మా బయటికెళ్ళి మాట్లాడాం. అన్నయ్య చాలా చిక్కిపోయాడు. ఎలెక్షన్లలో పోటీ చేసేందుకు ప్రభుత్వమే వారిని వదలి పెట్టిందట. ఇప్పుడిప్పుడే పోలీసుల భయంలేదన్నాడు. ఎక్కువసేపు మాట్లాడేందుకు వారికి వ్యవధి లేదట. నాకు నారాయణ యీ పత్రిక యిచ్చాడు. ఇది చదివితే కొన్ని సంగతులు తెలుసుకోగల అవకాశం లభిస్తుందన్నాడు."

"ఛీ! ఆ వెధవ సంగతి నా దగ్గర ఎత్తకు. వాడు పట్టి దరిద్రుడు, దేశద్రోహి!"

"అదేమిటి నాన్నా, అట్లా కోపగించుకుంటారు? అన్నయ్య మీ ఆరోగ్యం గురించి అడిగాడు. నాన్నకు నాపై కోపం పోయిందా అని నవ్వుతూ అడిగాడు."

"పోనీలే, అమ్మాయ్ వాడి సంగతి యిప్పుడెందుకు? వాడు తండ్రినే యెదిరించినవాడు. వాడంటే నా కెట్లాంటి ఆదరంలేదు. ఇప్పుడా సంగతెందుకుగాని, నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలనుకుంటున్నాను."

"ఏమిటి నాన్నా, అది?"

"ఏమీ లేదు... నీ పెండ్లి విషయం!"

"అప్పుడే నాకు పెండ్లేమిటి నాన్నా?"

"అప్పుడే యేమిటమ్మా? సంబంధం కూడా స్థిరపరచబోతోంటేను?"

"ఆ! నాకు చెప్పకుండానే"

"చెబుతున్నాను కదు తల్లీ. పోనీ నీకీ సంబంధం ఇష్టంలేకపోతే వేరొకటి చూస్తాం."

"మీ నాన్నకు చెప్పడానికే సిగ్గుపడితే ఎట్లా, విజయా? చెప్పు తల్లీ?"

"చెప్పమంటావా అమ్మా?"

"చెప్పు విజయా!"

"అయితే, మరి నేను... నేను ... నారాయణ్ణి చేసుకుంటాను."

"ఆ!"—అని అరిచాడు గోపాలరావు. అతని బుర్ర తిరిగిపోతోంది...

---

(పేజీ 2 తరువాయి)

తలకొక మతం
చెరొక కులం
కథనం చేసుకున్నాం
రొట్టిమీద నెయ్యితో ఒకరం
నెయ్యిమీద రొట్టితో ఒకరం
మా ప్రత్యేకత చాటడానికి
ఎన్నెన్నో పనులన్నీ చేశాం.
మేం చేసే తప్పులు దిద్దటం కోసం
మాలో లోపాలు సవరించటం కోసం
ఎవరూ లేకుండా చేసుకున్నాం
ఎవరమూ కాకుండా చూసుకున్నాం.
ఏ ఆశలతో కన్నావో మమ్మల్ని
నిన్నిట్లా ఉద్ధరించాం
నిన్నింత సుఖపెట్టాం
నిన్ను నోటినిండా పిలుచుకునే
తాహతుకూడా లేకుండా చేసుకున్నాం
మమ్మల్ని క్షమించటం తప్ప
నువ్వు చేయగలిగిం దేమీలేదని తెలిసే
క్షమాభిక్ష వేసుకుంటున్నాం
క్షమించావా, మేమింకా
విర్ర వీగిపోతాం—
విర్ర వీగాలని, సిగ్గువిడిచి
క్షమించమంటున్నాం మళ్ళీ.
కానీ—
క్షమించకు!
క్షమించకు!